# రక్షకుడు

టక్... టక్... టక్... టక్... ఎంతోసేపటి నుంచీ నిశ్శబ్దంగా భరిస్తున్న ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ... టక్... టక్... టక్... ఇప్పుడు సమయం పన్నెండు. నాకు తెలుసు ఈ శబ్దం... గూర్ఖా రంధీర్ కఱ్ఱ శబ్దం. అన్ని ఇళ్లల్లో లైట్లారిపోయాక నెమ్మదిగా లేచి కఱ్ఱ తీసుకుని తన డ్యూటీలో జాయిన్ అవుతాడు. ఆ కాలనీలో కొందరు పదింటికే పడుకునేవాళ్లున్నా, పన్నెండింటి దాకా టీవిలు చూస్తూ కూర్చునే చాలామంది ఇళ్లల్లో లైట్లు ఆరిపోయిందాకా తన కఱ్ఱని బుజ్జగించి శబ్దం చేయకుండా పక్కన పెడతాడు. కఱ్ఱ లేకుండానే పది తరువాత ఒక్కసారి కాలనీ మొత్తం ఒక చక్కరు కొడతాడు... అందరూ లైట్లార్పేశారని నిర్ధారించుకున్నాక తన విధి నిర్వహణ ప్రారంభిస్తాడు.

ఇటీవల ప్రతి అర్ధరాత్రి క్రమం తప్పకుండా వింటున్న శబ్దం... నా మెడ చుట్టూ పెనవేసుకున్న పాపాయి గులాబీ రంగు చేతులు సున్నితంగా పక్కకి తొలగించి, నెమ్మదిగా మంచం దిగాను. నితిన్ ఇవాళ కూడా ఇంకా రాలేదు. ఏమైంది నితిన్‌కి హఠాత్తుగా ఏదో జరిగింది. వారంనుంచీ ఇదే వరస పన్నెండు దాటాక కానీ రావడంలేదు. ఇదివరకు వారానికోసారి పార్టీలంటూ కొద్దిగా డ్రింక్ చేసి, పదకొండు, పన్నెండు లోపల వచ్చేవాడు. కానీ వారం నుంచీ ప్రతి రోజూ పార్టీలేనా అనడిగితే అదోరకంగా నవ్వాడు. పైగా నాపట్ల తన ప్రవర్తనలో కూడా ఏదో మార్పు కనిపిస్తోంది.

పాపాయితో రోజూ రాత్రిళ్లు ప్రాబ్లెమ్ అవుతోంది. డిన్నర్ చేయడానికి మారాం చేస్తోంది. నాన్న వచ్చాక తింటాను. నాన్న వచ్చాక బజ్జుంటాను అని... దాన్ని బుజ్జగించి, బతిమాలి, బామాలి అన్నం పెట్టి పడుకోబెట్టేటప్పటికి తలప్రాణం తోక్కి వస్తోంది. ఇలా లాభంలేదు... రేపు నితిన్‌ని నిలదీయాలి. ఏదో జరుగుతోంది.

దిగులుగా, అసహనంగా బాల్కనీలోకి వచ్చాను.

టక్... టక్... కింద రోడ్డు మీద నిటారుగా నడిచి వెళ్తొన్న రంధీర్ కనిపించాడు. అతని చేతిలో కఱ్ఱ కొన్ని క్షణాలు శబ్దం చేయడం ఆపేసింది.

అతను కదలకుండా అలాగే నిలబడిపోయాడు. నాకు తెలుసు అలా ఆగిపోయా డంటే అతను మా బాల్కనీలో పడిన బెడ్‌రూమ్ బెడ్‌లైట్ వెలుగు చూశాడు. నేనేదన్నా చెప్తానేమో అని కొన్ని క్షణాలు ఆగాడు. నేనేం చెప్పకపోడంతో తలవంచు కుని ముందుకు సాగాడు. ఇదీ నేను గమనిస్తున్నాను వారం నుంచీ... పన్నెండు అయిందని అతని కర్ర శబ్దం వినగానే నాలో ఏదో భయం, దిగులు, అసహనం.. వెంటనే బాల్కనీలోకి వచ్చి వీధి చివరి దాకా చూడడం... కాస్సేపు అక్కడే తచ్చాడి నిట్టూర్చి లోపలికి వెళ్లడం బహుశా అతనూ గమనిస్తున్నట్టున్నాడు. అందుకే నేను లోపలికి వెళ్లిందాకా అదే రోడ్డులో నాలుగుసార్లు తిరుగుతాడు. బెడ్‌రూమ్ నుంచి బాల్కనీలోకి ఉన్న డోర్ వేయగానే తిరిగి కర్ర శబ్దం కొంచెం దూరమవు తుంది.

రంధీర్ కర్ర కొట్టడంలో ఎంత కమ్మటి శబ్దం... ఎంత రిథమిటిక్‌గా ఉంటుందా శబ్దం. ఎవరు నేర్పారితనికి ఇంత అద్భుతమైన విద్య? చక్కని సంగీతా నికి అనుగుణంగా కదిలే మృదంగంలా, గాలి సంగీతానికి ఇంత లయబద్ధంగా కదుల్తుందా అతని చేతిలో కర్ర. నాకు నిశ్చింతనీ, బోలెడంత సెక్యూరిటీని ఇచ్చే శబ్దం. భయంతో నాలోకి నేను కుంచించుకుపోతుంటే నన్ను ఓదారుస్తూ, నాకు ధైర్యం చెబుతూ, ఆత్మీయంగా వినిపించే శబ్దం.

అతనంత క్రమశిక్షణతో, నిజాయితీతో తన ధర్మాన్ని నిర్వర్తించే సేవకుడు ఎవరూ ఉండరు... సేవకుడు ప్రజాసేవకుడు... మా కాలనీలో ఉన్న ఐదువందల మంది ప్రజలకు రాత్రిపూట రక్షణ కల్పించే సేవకుడు... చుట్టుపక్కల ఉన్న ఎన్నో కాలనీల్లో రాత్రి అవుతుందంటే భయంగా ఉండేది. దొంగతనాలు... నేరాలు... ఒకసారి ఒక కాలనీలోని పార్కులో అర్ధరాత్రి ఎవరు తెచ్చి పడేశారో ఒక స్త్రీ శవం... పెద్ద గొడవ పోలీసులు, హడావుడి పంచనామాలు, ఇంటరాగే షన్‌లు కాలనీ కాలనీ ఆ దెబ్బతో గుప్పిట్లో ప్రాణాలు పెట్టుకుంది. అందుక్కారణం వాళ్ల కాలనీలో రంధీర్‌లాంటి గూర్ఖా లేకపోడం... ఉన్న గుర్ఖాని అన్యాయంగా దొంగతనం ఆరోపించి తీసేసిన ఆ కాలనీ రాజకీయాల పాపం... ఆ కాలనీలోనే అంతులేనన్ని రాజకీయాలు... ఆ రాజకీయాల్లో బలైపోయిన గూర్ఖా... అతని పరిస్థితి కళ్లారా చూసిన మరో గుర్ఖా ఆ కాలనీలో అడుగుపెట్టకపోవడం.

కానీ, మా కాలనీలో అలాకాదు... మా రంధీర్ ఎంతో మంచివాడు. నెమ్మదస్తుడు. ఎంత నెమ్మదస్తుండంటే అతని కష్టానికి ఇచ్చే పది రూపాయలను కూడా ఎంతో నమ్రతగా అడుగుతూ వాళ్లు ఎన్నిసార్లు రమ్మంటే అన్నిసార్లు ఓపికగా తిరిగి పదో రోజు ఇచ్చినా తీసుకుని సలాం కొట్టి వెళ్లేంత మంచివాడు.

ఆ మంచివాడిని ఎన్ని రాజకీయాలున్నా ఏం చేయగలవు? ఆ మంచితనానికి ఎంత దుర్మార్గం అయినా తలవంచాల్సిందే. నిజానికి అతను తీసుకునేది వేలు కాదు, లక్షలుకాదు... కేవలం వందల్లో జీతం... ఉండడానికి ఐదువందల మంది ఉన్నా కుటుంబాలు మాత్రం 50 కుటుంబాలే... ఒక్కో కుటుంబం నుంచి అంటే ఒక్కో ఇంటినుంచీ నెల దాటిన పదో రోజుకి అతనికి దక్కేది పది రూపాయలు. 50×10= 500. పాపం 500 రూపాయలు. నాకు తెలుసు, ఆ పది రూపాయలు ఇవ్వడానికి పదిసార్లు తిప్పే అమ్మగార్లు, అయ్యగార్లు, ఆ పదిరూపాయలు దానం ఇస్తున్నట్లో, జాలిపడి ఇస్తున్నట్లో భావిస్తూ, ఇవాళ చేయి ఖాళీ లేదు, రేపు రా అనో, ఇవాళ చిల్లర లేదు రేపు తీసుకో అనో వెధవ శుక్రవారం పూట పొద్దున్నే తగలడతాడు. రేపు రమ్మనండి అని చీదరించుకునే ఇల్లాళ్లనూ చూసిచూసి విసిగి విరక్తి చెందిన నేను రంధీర్‌ని ప్రేమించడం నేర్చుకున్నా.

ఒకటో తారీకు పొద్దున్నే అమ్మా అంటూ సలాం కొట్టే రంధీర్ రావడం ఆలస్యం పది రూపాయలు చేతిలో పట్టుకుని నిలబడేదాన్ని. అదే అలవాటు పాపాయికి నేర్పాను. అది కొంచెం పెద్దయ్యాక సరదాగా ఇప్పించడం నేర్పిస్తూ ఆ ఇవ్వడంలో ఇష్టాన్ని నేర్పాను. దానంలా కాకుండా అతని కష్టానికి ప్రతిఫలం ఇస్తున్న భావన నా చిట్టితల్లిలో కలిగించాను. పొట్టకూటి కోసం తరతరాలుగా గుర్కా వృత్తితో తృప్తిపడుతూ, అదే వృత్తిలో దైవాన్ని దర్శించుకునే ఆ దార్శనికుడికి పది రూపాయలు ఇవ్వడం ఇష్టంగా, గుళ్లోని హుండీలో వేసేంత భక్తిగా ఇవ్వడం నేర్పాను. అంతేకాదు, దసరా మామూలుకి వచ్చినప్పటినుంచీ నేనే అతని జీతం ఇంటికి 20 రూపాయలుగా మార్చాను. నిత్యావసర వస్తువుల ధరలతోపాటు, కరెంట్, నీళ్లు, పెట్రోలు, ఆఖరికి అతని చేతిలో కర్ర ధర కూడా పెరిగి పోయిన అతని ఆదాయం సరిపోతుందా? లేదా అనే ఆలోచన ఎవరికుంది? ఎవరికీ ఉండదు. సామాన్యుడి గురించిన ఆలోచన ఉంటే ప్రభుత్వం ధరలనిలా పెంచు తుందా? అంతే... అందుకే ఎవరో ఒకళ్ళు గుర్తించి అతడి ఆదాయం పెంచాలి అని నేనే ఆ పని చేశాను. మాటల్తో వ్యక్తం చేయలేకపోయినా నా ఎదురుగా వచ్చినపుడు అతని బాడీ లాంగ్వేజ్‌లో ఎంతో కృతజ్ఞత కనిపిస్తుంది.

రాత్రి పదిగంటల నుంచి ఉదయం ఐదింటి దాకా కాళ్లరిగేలా కర్ర కొడుతూ అదీ ఎవరికీ నిద్రాభంగం కలక్కుండా మధురమైన ధ్వని తరంగంలా లయబద్ధంగా కొడుతూ కాలనీ మొత్తం తిరుగుతూ ఒక్క దొంగని కానీ, అసాంఘిక శక్తులను గానీ రానీకుండా మమ్మల్నందరినీ కంటికి రెప్పలా కాపాడే రంధీర్‌కి పది రూపాయలు పెంచడం పెద్ద విశేషం కాకపోవచ్చు... కానీ, ఒక్కోసారి చిన్నచిన్న విషయాలే ఎంతో సంతృప్తిని కలిగిస్తాయి. రంధీర్‌కి ఇచ్చిన డబ్బు నాకు

అలాంటి సంతృప్తినే ఇస్తుంది.

బహుశా అతని పేరు రణధీర్ అయిఉండచ్చు. అందరూ రంధీర్ అంటారు. నేనూ అలాగే అంటాను. అతని అసలు పేరేంటో అడగాలన్న ఆలోచన నాకెప్పుడూ రాలేదు. ఆ అవసరం కూడా లేదు. ఎందుకంటే అతడిని ఏ పేరుతో పిలిచినా పలుకుతాడు. పేరుతో పిలవకపోయినా పలుకుతాడు. నిత్యం భక్తులను తన చూపులతో కాపాడే సాయిబాబాలా అనిపిస్తాడు. ఏటి ఒడ్డునుంచే తన పిల్లల్ని చూపులతో కాపాడే తాబేలులా అనిపిస్తాడు.

నా కళ్లు వీధి చివర దాకా వెళ్తూ, వస్తూ అనిశ్చితంగా కదుల్తున్నాయి. ఏదో భయం, దుఃఖం కలుగుతోంది. నితిన్ ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడు? ఎవరా పార్టీలిచ్చే వెధవలు... ధరలింతగా పెరిగిపోయిన ఈ రోజుల్లో రోజూ హోటల్లో తాగుడుకీ, తిండికీ వేలు ఖర్చు పెట్టేవాళ్లెవరు? మా పెళ్లయిన ఐదేళ్లలో నితిన్ ఎప్పుడూ ఇలా ఆలస్యంగా రావడం, నాతో ముక్తసరిగా, ముభావంగా ఉండడం నాకు తెలియదు. మాది అనురాగ దాంపత్యం... మా అనురాగదీపం మా ముగ్ధ. అదంటే నాకన్నా నితిన్‌కే ఎక్కువ ప్రాణం. వాళ్ల బాస్ ఎనిమిదింటిదాకా ఆపేస్తాడని ఇంటికొచ్చి దాంతో చెప్పుకుని వాళ్ల బాస్‌ని నానాతిట్లు తిట్టే నితిన్ ఈమధ్య ముగ్ధతో కూడా సరిగా ఉండడంలేదు. ఏదో ఎడంగా, తప్పు చేస్తున్న వాడిలా, ఇబ్బందిగా ఉంటున్నాడు. ఏం జరుగుతోంది? భగవంతుడా... నా సంసారంలో తుఫాను రేగడం లేదు కదా... నేనెన్నడూ ఇలాంటి సిట్యుయేషన్ ఊహించలేదు.

హైదరాబాద్‌లో కత్రినాలు, సునామీలు వస్తాయా? రావు... ఎక్కడ ఎలాంటి వరదలొచ్చినా, ఎంత పెద్ద బీభత్సం జరిగినా హైదరాబాద్ సురక్షితంగా ఉంటుంది. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన నా జీవితం కూడా అంతే అనుకున్నా... అలాగే సాగింది కూడా. కానీ... కానీ నితిన్‌లో ఏదో మార్పు... భయంకరమైన మార్పు. ఈ పెనుమార్పు నాకు నిద్రని దూరం చేస్తోంది. అప్పటిదాకా పది దాటకుండానే నన్ను కౌగిట్లోకి రప్పించుకోడానికి నితిన్‌చేసే హడావుడి, అల్లరి, అలకలు, చిలిపి చేష్టలు, ముద్దు, ముద్దుగా మందలిస్తూనే మరీమరీ కావాలని కోరుకుంటూ పది కొట్టగానే లైటార్పేసిన రోజుల నుంచి పన్నెండైనా, ఒంటిగంట అయినా, రెండు అయినా నిద్రకి కరువైపోయాయి.

కలలో కూడా నితిన్ గురించి చెడుగా ఆలోచించని నా మనసుకి హఠాత్తుగా తగిలిన ఈ చేదు ప్రతి రక్తకణం నిండా నిండిపోయి నా నాలుక రుచిని కోల్పోయినట్టు తిండికి దూరమైనాను. అయినా ఎందుకో నితిన్‌తో గట్టిగా మాట్లాడలేకపోతున్నాను. ఎందుకిలా ఆలస్యంగా వస్తున్నావు ఇంటికి అని అడగలేక

పోతున్నాను. ఎందుకని?

చిన్నప్పటినుంచీ సున్నితమైన మనస్తత్వంతో, మొహమాటం, సిగ్గు, జంకు లాంటి స్త్రీలకుండే కొన్ని అసహజమైన గుణాలతో పెరిగానేమో ఒంటరిగా ఎక్కడికీ వెళ్లలేను... పదిమందిలో మాట్లాడలేను. వేదికలెక్కి కాలేజీలో కూడా ఏనాడూ ఏ కార్యక్రమంలో కూడా పాల్గొనలేదు. బి.ఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో కాలేజీ ఫస్టు వచ్చిన నేను క్యాంపస్ సెలక్షన్‌లో ఫెయిల్ అవడానికి, అందరికన్నా లాస్ట్‌లో బోర్డరులో పాసైన హరిణి సెలెక్ట్ కావడానికి కారణం తనకున్న పూర్ కమ్యూనికేషన్ స్కిల్స్, హరిణికున్న ఎక్సలెంట్ కమ్యూనికేషన్ స్కిల్స్. 'నువ్వు నలుగురితో మాట్లాడడం నేర్చుకోకపోతే నీకీ జన్మలో ఉద్యోగం రాదు' అని హరిణి చాలాసార్లు అనేది. 'పోదూ వెధవ ఉద్యోగం... నాకా అవసరం రాదులే' అన్నాను చాలా కాన్ఫిడెంట్‌గా.

ఆ వీక్‌నెస్ నన్ను ఏదో అగాధంలో తోసేసేలా ఉంది. ఇప్పటికైనా నేను నితిన్‌తో ఖచ్చితంగా మాట్లాడడం నేర్చుకోవాలి. అకస్మాత్తుగా నాతో, పాపతో ముభావంగా మారడానికి, రాత్రిళ్లు ఇంటికి ఆలస్యంగా రావడానికి, ఇంట్లో అసలు సరదాగా గడపకపోడానికి కారణం ఏమై ఉంటుంది? నానుంచి ఏదన్నా పొరపాటు జరిగిందా? మామూలు ఆడవాళ్లలా నేను కూడా మగవాడిలోనే లోపం వెదుకుతున్నానా? నా తరఫు నుంచి ఏదన్నా పొరపాటు జరిగిందేమోనన్న ఆలోచన నాకెందుకు రాలేదు. సంసారం పాడు కావడానికి భర్త ప్రవర్తనే కారణం అవుతుందన్న విశ్వాసం ఎక్కడినుంచి వచ్చింది నాకు? నితిన్ మారాడు. కానీ, ఆ మార్పు నేను గ్రహించినట్టు అతనికి తెలిసిందా? ఆ మార్పు నన్ను, నా కూతుర్ని బాధపెడుతోందని అర్థం అయిందా? ఒకవేళ అర్థం అయితే అతనెందుకు నాకు వివరణ ఇవ్వలేదు? అడిగితే చెప్పాలనుకున్నాడా?

మరి నేనెందుకు ఈ మార్పుని మౌనంగా భరిస్తున్నాను. నేనెందుకు అతడిని నిలదీయలేదు. నిలదీయడం సంగతి పక్కనపెడితే అసలు నేను ఏమీ అడగలేదు. అతను అలా ఆలస్యంగా రావడం, ముభావంగా ఉండడం చాలా మామూలు విషయంలా భావించానా? నేను నిజంగా ఫూల్‌ని...భార్యగా నా విద్యుక్త ధర్మాన్ని విస్మరించాను. ఏమైనా సరే రేపు అడగాల్సిందే... అలా నిర్ణయించుకున్నాక కొద్దిగా నా మనసుకి ఊరట కలిగింది. ఇంతలో రోడ్డు మీద స్కూటర్ హెడ్‌లైట్ వెలుగు కనిపించింది. చిన్న వణుకు. నిశ్శబ్దంగా లోపలికి నడిచి తలుపు వేసేసి, హాల్లోకి నడిచి మెయిన్ డోర్ గడియ తీసి లోపలికి వచ్చేశాను. మంచంపైన వాలిపోయి, కళ్లు మూసుకున్నాను. జరగబోయేదేంటో తెలుసుకోవాలన్న ఆరా

టంతో... కాస్సేపటికి ముగ్ధ పక్కకి చేరి ఎడం చేయి దానిమీద వేసి పడుకున్నాడు నితిన్. నేను కళ్లు తెరవకుండా అలాగే శూన్యంలో ఏదో వెదుక్కుంటూ పడుకున్నాను.

నేను అడగాలనుకున్న ప్రశ్న నా నోటినుంచి రావడం లేదు. ఎక్కడికి వెళ్తున్నావు? ఎందుకు ఆలస్యంగా వస్తున్నావు? నేనేదన్నా పొరపాటు చేశానా? నువ్వే ఏదన్నా తప్పు చేస్తున్నావా? ఈ నాలుగు ప్రశ్నలు అడగడానికి నాలుగు రోజులు రిహార్సల్స్ చేసాను. అయినా నావల్ల కాలేదు. నా చేతకానితనానికి నామీద నాకే అసహ్యం వేసింది.

మరునాడు రోజూలాగే 'నాన్న రానీ... నాన్న నన్ను ఎత్తుకోలేదు... నాకు అన్నం వద్దు' అని మారాం చేస్తున్న ముగ్ధని బతిమాలి, బుజ్జగించి అన్నంపెట్టి పడుకోబెట్టాను. నాకు ఏం తినాలనిపించలేదు. అన్నీ సర్దేసి పడుకున్నాను. రంధీర్ కర్ర శబ్దం అయిందాకా పడుకోడం, ఆ శబ్దం రాగానే ధైర్యంగా బాల్కనీలోకి వెళ్లి నితిన్ కోసం వీధి పొడుగునా నిరీక్షించడం... తమాషాగా ఆరోజు నాకు ఎంతసేపటికీ శబ్దం వినిపించలేదు. ఏమై ఉంటుంది రంధీర్‌కి... ఆలోచిస్తుంటే కాలింగ్‌బెల్ మోగింది. నితిన్ వచ్చాడు... ఒక్క ఉదుటున లేచాను. గడియ తీయగానే ముందు నితిన్... వెనకాల రంధీర్. నితిన్ తల వంచుకుని కొద్దిగా తూలుతూ లోపలికి వచ్చాడు. రంధీర్ నావైపు చూడకుండా సలాంచేసి వెళ్లిపోయాడు.

నాకేం అర్థంకాలేదు. ఏమైంది? రంధీర్ సాయంతో ఎందుకొచ్చాడు నితిన్? ఏదన్నా యాక్సిడెంట్ అయిందా? స్కూటర్ శబ్దం రాలేదే... ఎలా వచ్చారిద్దరూ? అంటే డ్రైవ్ చేయలేనంతగా తాగాడా... ఎక్కడన్నా పడిపోతే రంధీర్ తీసుకొచ్చాడా? అతనికెలా తెలుసు? ఈ కాలనీ దాటి వెళ్లని రంధీర్‌కి నితిన్ ఎక్కడ? ఎప్పుడు, ఎలా తారసపడ్డాడు? నా మనసులో వంద ప్రశ్నలు మూకుమ్మడిగా దాడి చేశాయి. కానీ ఒక్క ప్రశ్న కూడా బైటికి రాలేదు. నితిన్ సోఫాలో వాలిపోయి అడ్డంగా పడుకున్నాడు. కాళ్లకి బూట్లు లేవు కానీ, సాక్స్ ఉన్నాయి. బూట్లు అస్తవ్యస్తంగా ఆమూలకొకటి, ఈమూలకొకటి విసిరేసినట్టు పడి ఉన్నాయి. అతని దగ్గరగా నడిచి మీద చేయి వేయబోయాను. చండాలపు వాసన... కంపు... కడుపులో తిప్పేసింది. అక్కడినుంచి బెడ్‌రూమ్‌లోకి వెళ్లిపోయి నా చిట్టితల్లి పక్కన వాలిపోయాను. కన్నీళ్లు రాకుండా దుఃఖం ఘనీభవించినట్టు అనిపిస్తోంది.

తెల్లవారి లేచాక నితిన్ మొహం ఎర్రగా జేవురించి ఉంది. కళ్లు కూడా నిప్పుల్లా ఉన్నాయి. నాతో ఏమీ మాట్లాడలేదు. కనీసం కాఫీ కూడా తాగలేదు.

ఎనిమిదింటికి బైటకి వెళ్లిపోయాడు. కాకపోతే రాత్రి ఎనిమిదింటికే వచ్చాడు. కానీ, నాతో మాట్లాడలేదు. ముగ్ధతో కాస్సేపు ఆడుకుని అన్నం తిని పడుకున్నాడు. ఇలా నాలుగు రోజులు గడిచాయి.

ఐదోరోజు ఉదయం సరిగ్గా పదకొండు గంటలకి కాలింగ్‌బెల్ మోగింది. ఎదురుగా రంధీర్.

ఇవాళ ఫస్టు కాదే... రంధీర్ ఎందుకొచ్చాడు? 'చెప్పు రంధీర్' అన్నాను.

"మేమ్ సాబ్ ఆప్ ఏక్ బార్ నీచే ఆనా..." అన్నాడు.

"ఎందుకు?" అడిగాను నొసలు చిట్లించి.

"ఆయియే..." అంటూ మరోమాటకి అవకాశం ఇవ్వకుండా మెట్లు దిగి వెళ్లిపోయాడు. నేను డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరకు నడిచి జడేసుకుని, మొహం తుడుచుకుని పౌడర్ అద్దుకుని, ముగ్ధని ఎత్తుకుని, డోర్ తాళంవేసి కిందికి దిగాను. నాలుగో ఇంటి దగ్గర మరో పదిమంది కాలనీ ఆడవాళ్లు ఉన్నారు. వాళ్లకి కొంచెం ఎడంగా రంధీర్.

నన్ను చూడగానే ముందుకొచ్చి పాపనివ్వమని చేతులు చాచాడు. ముగ్ధ అతనలా చేతులు చాచగానే ఆ చేతుల మీదికి ఎగిరింది. పాపనెత్తుకుని అతను ముందు నడుస్తుంటే మిగతా ఆడవాళ్లంతా అతడిని అనుసరించారు. అయోమయంగా ఎక్కడికి? ఏమిటి? అని అడక్కుండా నేనూ వాళ్లని అనుసరించాను.

కాలనీలో ఈమధ్యే కొత్తగా కట్టిన అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లారంతా. ఏముంది ఇక్కడ? అడిగాను నాతో కొంచెం బాగా మాట్లాడే కవితను... 'పద చెప్తాను'... అంటూ లిఫ్ట్ వైపు నడిచింది. లిఫ్ట్ ఐదో అంతస్తుకి వెళ్లగానే రంధీర్ మాకు ఒక ఫ్లాట్ చూపించి, తను పాపని తీసుకుని కొంచెం దూరంగా నిలబడ్డాడు. ఒకావిడ కాలింగ్ బెల్ కొట్టింది. కొన్ని నిమిషాల్లో ముప్ఫై ఏళ్ల యువతి వచ్చి తలుపు తీసింది. ఆమె చాలా ఆధునికంగా అలంకరించుకుని ఉంది. స్లీవ్‌లెస్ జాకెట్టు, పెదాలకు లిప్‌స్టిక్, బొడ్డు కిందకి చీర... ఎందుకో నాకు ఆమె నచ్చలేదు. నేను లోపలికి వెళ్లాలా వద్దా అని సంశయిస్తుండగానే ఆడాళ్లంతా ఆమెని తోసుకుని లోపలికి వెళ్లారు. కవిత నావైపు చూసి రా అంటూ పిలిచింది. ఎందుకు? ఆవిడెవరు? మేమంతా ఎందుకు ఆమె మీదకి దాడి చేస్తున్నాం. నాకేం అర్థంకావడంలేదు. ఆడవాళ్లంతా ఆమెని తిడుతున్నారు. చాలా అసహ్యంగా, బూతులు తిడుతున్నారు. సిగ్గుందా? దరిద్రపుదానా? మా సంసారాలు నాశనం చేస్తావా? అంటూ ఆప

కుండా తిడుతున్నారు. కొంతమంది ఆమె విరబోసుకున్న జుట్టు పట్టుకుని మెడ వెనక్కి వంచి బలంగా మెడ అటూ, ఇటూ తిప్పేస్తున్నారు. హఠాత్తుగా జరిగిన దాడికి ఆమె నిశ్చేష్టురాలైంది. ఆమె మొహంలో కత్తివాటుకి నెత్తురుచుక్క లేదు. భయంతో బిక్కచచ్చిపోయింది. ఇంతలో యాభైఏళ్ల స్త్రీ, అరవై ఏళ్ల పెద్దాయన, వాళ్ల వెనకాల ఇద్దరు లేడీ కానిస్టేబుల్స్ ఏదో టివి ఛానెల్ వాళ్లు కెమెరా పట్టుకుని బిలబిలలాడుతూ వచ్చారు.

యాభై ఏళ్ల స్త్రీని చూడగానే ఆ అమ్మాయి ఆడవాళ్లందర్నీ తోసేసుకుంటూ 'అమ్మా' అంటూ వచ్చి ఆవిడ్ని వాటేసుకోబోయింది. ఆవిడ ఛీత్కారంగా వెనక్కి జరిగి "ఛీ పాపిష్టి దానా? నన్ను ముట్టుకోకు. నువ్వు చచ్చావని మేము నిశ్చింతగా ఉన్నామింతకాలం. నీ బతుకు చెడ. ఎందుకే ఇట్లాంటి బతుకు బతక్కపోతే చావచ్చు గా... ఎందుకీ బతుకు? తోటి ఆడవాళ్ల జీవితం నాశనం చేస్తూ నువ్వు ఆనందంగా బతుకుతావా? తన్నండమ్మా దీన్ని అడ్డంగా నరకండి" అంటూ ఆవేశపడుతున్న ఆవిడని పక్కకి జరిపి పెద్దాయన ఆవిడ్ని మందలిస్తున్నారు, 'నీ ఆరోగ్యం జాగ్రత్త... ఆవేశపడకు' అంటూ.

లేడీ కానిస్టేబుల్స్ ఆ యువతి దగ్గరకు వెళ్లి భుజమ్మీద లాఠీతో పొడుస్తూ... 'నడు... చేసింది చాలు... మస్తు ఎంజాయ్ చేసినవ్... ఇంక జైల్లో చేద్దువు నడు...' అంటూ లాఠీతోటే ఆమెని ముందుకు తోశారు.

కెమెరాలు క్లిక్, క్లిక్ మనిపిస్తూ టివి ఛానెల్ వాళ్లు ఆమెని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. నిశ్చేష్టురాలై చూస్తున్న నాకు కవిత చెప్తున్న విషయం లీలగా, ఏదో కలలోగా విన్పించసాగింది.

ఆ యువతి ఆ అపార్ట్‌మెంట్‌లో చేరి ఏడాది కావస్తోంది. ఆమె చిన్నప్పటి నుంచీ దొంగతనాలు చేస్తూ, చదువుకోకుండా చిల్లరగా తిరుగుతూ, పాతికేళ్లకి పాతికమంది బాయ్‌ఫ్రెండ్స్‌ని మార్చింది. ఆమె ప్రవర్తనకి విసిగిపోయిన తల్లిదండ్రు లు ఆమెని ఇంట్లోంచి వెళ్లగొట్టారు. ఎక్కడ తిరిగిందో ఏం చేసిందో బాగా డబ్బు సంపాదించింది. ఎక్కడో ఇదివరకు అపార్ట్‌మెంట్‌లో ఉంటూ వెధవ పనులు చేసి అక్కడ తంతే ఇక్కడొచ్చి పడింది. వచ్చిన దగ్గర్నించీ ఆ కాలనీలో కనిపించిన మగాడిని వల్లో వేసుకుని వాళ్ల పర్సులు ఖాళీ చేస్తూ వాళ్లని తాగించి, వాళ్లతో ఎంజాయ్ చేస్తోంది. కాలనీలో చాలామంది మగవాళ్లు రాత్రిళ్లు ఆలస్యంగా రావడం, భార్యలకి తెలిసి గొడవలు పడి, నానాయాగీ అయి మొగుళ్లని అదుపులో పెట్టుకునే వాళ్లు పెట్టుకున్నారు. లేనివాళ్లు కన్నీళ్లతో కాలం గడుపుతున్నారు.

ఎప్పటినుంచో ఇదంతా గమనిస్తున్న రంధీర్ 'ఆపరేషన్ విత్ ఆడవాళ్లు'

అనే కొత్త ఫార్ములాతో చిక్కు సమస్య విప్పాడు. చాలా పకడ్బందీగా ఆమె తల్లి దండ్రుల అడ్రస్ తెలుసుకుని, ఆమె స్వభావం తెలుసుకుని వజ్రాన్ని వజ్రంతోటే కోయాలన్న సూత్రం తెలుసుకుని, మా ఆడవాళ్లనీ, లేడీ కానిస్టేబుల్స్‌నీ, సాక్ష్యం కోసం టివి ఛానెల్ వాళ్లనీ పిల్చుకొచ్చి ఆ యువతిని అక్కడి నుంచి వెళ్లగొట్టే సాహసం చేసిన రంధీర్ మా రక్షకుడు. అతని వైపు చూశాను. ఇక్కడ జరిగే తతంగంతో తనకేం సంబంధం లేనట్టు పాపాయితో కబుర్లు చెప్తున్నాడు.

ఎవరన్నా నెగెటివ్‌గా మాట్లాడినా, తన ట్రాప్‌లో చిక్కుకోకపోయినా ఆ మగాడి మీద రేప్ కేసు పెట్టడం ఆ యువతి నేర్చుకున్న విద్యలో ఒకటి. 'అంతేకాదు' కవిత స్వరం డామినేట్ చేస్తూ పెద్దాయన స్వరం వినిపించింది. 'చూడమ్మా కానిస్టేబులమ్మా... దీనికి ఏ శిక్ష అయినా సరే వేయమను... ఉరిశిక్ష అయినా సరే... మాకు మాత్రం చెప్పకండి... పదవే వెడదాం' అంటూ భార్యని తీసుకుని వెళ్లబోతూ మా అందరివైపు చూసి రెండు చేతులూ జోడించి "క్షమించండమ్మా ఈ దరిద్రపుది చేసిన పనికి నేను క్షమార్పణ అడుగుతున్నాను." అంటూ ఆ వృద్ధ దంపతులు తలవంచుకుని వెళ్లిపోయారు.

ఆ యువతిని చూస్తుంటే జాలి పడాలో, అసహ్యించుకోవాలో అర్థంకాలేదు. టివి కెమెరాకి కనిపించకుండా మొహం మీద చీరచెంగు కప్పుకుని తలవంచుకుని కానిస్టేబుల్స్ వెంట వెడుతోంది. మొత్తం అపార్ట్‌మెంట్‌లో ఉన్నవాళ్లంతా గుంపులు, గుంపులుగా చేరుతున్నారు.

ఇంకా ఏదో చెప్తూనే ఉంది కవిత... "డబ్బు కోసం మనుషులు ఎంతకైనా దిగజారుతున్న సమాజం ఇది సరితా... ఆడ, మగా తేడాలేదు. ఎవరైనా, ఏ పని చేయడానికైనా సిద్ధపడుతున్నారు. ఇంత చండాలంగా సంపాదించి ఈ విలాస వంతమైన బతుకు బతక్కపోతేనేం... దీని బతుకు కూడా ఓ బతుకా? మన దౌర్భాగ్యం కాకపోతే దీనింటికి రావడం ఏంటి? పదండి వెడదాం..." అంటూ అందర్నీ హెచ్చరించి తను నా చేయి పట్టుకుని ముందుకు నడుస్తూ అంది... "మనం చాలా అదృష్టవంతులం. ఎక్కడి నుంచి వచ్చాడో మనందరికీ తోబుట్టువులా దొరికాడు. ఏ అన్న కూడా చేయడింతటి ధైర్యం కదూ..." అంది రంధీర్ వైపు కృతజ్ఞతగా చూస్తూ.

అదేం పట్టించుకోని రంధీర్ పాపాయి నెత్తుకుని లిఫ్ట్ దగ్గరకు నడిచి బటన్ నొక్కాడు.

***

*(ఆంధ్రభూమి ఆదివారం అనుబంధం, జూన్ 2012)*